క్లుప్తంగా

అందుబాటులో వరి విత్తనాలు

గన్నవరం రూరల్: రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వై.రజిని మంగళవారం తెలిపారు. రైతులు వీటిని తీసుకోవచ్చన్నారు. సూరంపల్లిలో ఎంటీయూ1061- 30 కేజీల బ్యాగ్ రూ.1,110, ఎంటీయూ1318- 30 కేజీల బ్యాగ్ రూ.1,110, బీపీటీ 5204-30 కేజీల బ్యాగ్ రూ.950 వంతున అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లి పెసర్లు, పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులు పొందవచ్చని చెప్పారు.

ఉద్యోగుల బదిలీలు

పెనమలూరు: మండల పరిధిలో ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. చోడవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.సునీత మానికొండకు బదిలీ అవ్వగా ఆమె స్థానంలో అగినిపర్రు నుంచి వి.నరసింహారావు చోడవరం కార్యదర్శిగా వచ్చారు. వివాదాల గంగూరుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు ఇప్పటికే డెప్యూటేషన్‌పై గరికపర్రులో ఉండగా ఆయనకు అక్కడే పోస్టింగ్ ఇచ్చారు. గంగూరు కార్యదర్శిగా మానికొండ నుంచి వీఎస్.ప్రకాష్‌నాథ్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న కె.మాధవాచారిని తాడంకి జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీ చేయగా ఆయన స్థానంలో మండవల్లి జెడ్పీ పాఠశాల నుంచి అనీల్‌కల్యాణ్‌ను నియమించారు. టైపిస్టు వీఎస్.సుగుణామణిని పీఆర్ డివిజన్ విజయవాడకు బదిలీ చేయగా ఆమె స్థానంలో జి.కొండూరు నుంచి ఎ.శ్రీరామమూర్తిని టైపిస్టుగా నియమితులయ్యారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల పనితీరు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యల పరిష్కారం దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. అయితే కీలక శాఖలకు చెందిన అధికారులు డుమ్మా కొట్టడంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్ నియంత్రణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రాథమికదశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తించటం వల్ల ప్రాణాంతక వ్యాధి బారి నుంచి బయటపడవచ్చని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా తెలిపారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో ఏర్పాటు చేసిన మొబైల్ క్యాన్సర్ స్కానింగ్ యూనిట్ ద్వారా మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 49 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10 మందికి మెరుగైన నిర్ధారణ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఈ శిబిరంలో సేవలు అందించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష, చలమలశెట్టి రమేష్ బాబు, అట్లూరి శ్రీనివాస్, గరికపాటి చంటి, వడ్డి నాగేశ్వరరావు, మద్దాల జయరాణి పాల్గొన్నారు.

14న యోగాంధ్రపై అవగాహన

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 21వ తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంపై ఈ నెల 14న మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. యోగాపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిప్పించేందుకు ప్రతి గ్రామంలో ట్రయినర్స్ కు శిక్షణ ఇప్పించామన్నారు. వారు ఆయా గ్రామాల్లో యోగా చేయడం వలన ఆరోగ్యపరంగా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారన్నారు. అదే విధంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు యోగాసనాలు చేయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

పెనమలూరు: కానూరులో విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు అమరావతి కాలనీకి చెందిన కొల్లంశెట్టి శివరోహిత్ విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. అతను ఈ నెల 4వ తేదీ నుంచి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తల్లి కొల్లంశెట్టి నాగహరిత ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాత గోగినేని వెంకటేశ్వరరావు సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మూడు ముక్కలాటకు తెర

- తాడిగడప మునిసిపల్ కమిషనర్ బదిలీ
- అనుకూల కమిషనర్ కోసం టీడీపీ ప్రయత్నం
- అనూహ్యంగా కొత్త కమిషనర్‌గా నజీర్ నియామకం
- కంగు తిన్న టీడీపీ నేతలు


తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం

పెనమలూరు: వివాదాలకు నిలయమైన తాడిగడప మున్సిపాలిటీలో గత కొద్ది రోజులుగా కమిషనర్ పోస్టు కోసం జరుగుతున్న మూడు ముక్కలాటకు ఎట్టకేలకు తెరపడింది. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న భవానీప్రసాద్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో కమిషనర్ బదిలీపై గత కొద్ది రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెర పడింది.

వివరాలు ఇవీ..

తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌గా భవానీప్రసాద్ ఏడాది క్రితం వచ్చారు. ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకున్న తరువాత టీడీపీ నేతలతో అంతర్గత విభేదాలు తలెత్తాయి. మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాల దందా, కాసుల వసూళ్లపై వాటాలు, ఇంటి ప్లాన్‌లు, ఇంటి పన్నులు ఇలా అనేక విషయాలలో తాడిగడప మున్సిపాలిటీలో వివాదాలతో అవినీతి రాజ్యమేలింది. సామాన్యులు మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం వస్తే పట్టించుకునే నాథుడే లేక పోవటంతో ప్రజల్లో పాలకులపై తీవ్ర అసంతృప్తి పెరిగింది. కమిషనర్‌కు, టీడీపీ నేతలకు పొంతన కుదరక పోవటంతో రచ్చ మొదలైంది. కమిషనర్ భవానీప్రసాద్ ఉంటే టీడీపీ చోటామోటా నేతలకు సమస్యగా మారింది.

డామిట్ కథ అడ్డం తిరిగింది

కమిషనర్ భవానీప్రసాద్‌ను ఇంటికి పంపాలని టీడీపీ నేతలు వేసిన ఎత్తుగడ తలక్రిందులైంది. భవానీప్రసాద్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో తాడిగడపలో పని చేసిన పూర్వ కమిషనర్ ముప్పూరి వెంకటేశ్వరరావును తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా తీసుకురావాలని మున్సిపల్ శాఖ మంత్రికి ఎమ్మెల్యే లెటర్ ఇచ్చారు. వెంకటేశ్వరరావు ఒంగోలు బీసీ కార్పొరేషన్‌లో ఈడీగా పని చేస్తున్నారు. టీడీపీ నేతలు వెంకటేశ్వరరావు తిరిగి వస్తారని ఆశతో ఎదురు చూశారు. అయితే కథ అడ్డం తిరిగింది. వెలగపూడి సచివాలయంలో జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న షేక్ నజీర్‌ను తాడిగడప కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టీడీపీ నేతలతో పాటు ఇక్కడ కమిషనర్‌గా రావాలని పైరవీలు చేసిన వారు కంగుతిన్నారు. కమిషనర్ భవానీప్రసాద్‌కు పోస్టింగ్ ఇవ్వకుండా పేరెంట్ డిపార్టుమెంట్ కమిషన్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. కొత్తగా పోస్టింగ్ వచ్చిన కమిషనర్ నజీర్ ఫారెన్ సర్వీసులో ఉండగా తాడిగడప కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వటం చర్చనీయంగా మారింది.

తులాభారమేనా..?

కాసులు కురిపించే తాడిగడప మున్సిపాలిటీలో కమిషనర్ పోస్టు కావాలంటే తులాభారమే అని గుసగుసలు వినబడుతున్నాయి. అక్రమాలకు అడ్డాగా ఉన్న తాడిగడప మున్సిపల్ కమిషనర్ పోస్టు చాలా ఖరీదని చెబుతున్నారు. టీడీపీ నేతలు పట్టుపట్టినా ఆఖరి క్షణంలో మరో కమిషనర్ తెరపైకి రావటంతో మూడు ముక్కలాటకు ఎట్టకేలకు తెరపడింది. దీని వెనుక ఒక మంత్రి హస్తం ఉందని ప్రచారం జరుగుతోంది.

ఇప్పటికైనా..

ఇప్పటికైనా తాడిగడప మున్సిపాలిటీలో అవినీతి లేని పాలన ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తారా లేక పాత పద్ధతిలాగే దందాలతో పాలన సాగుతుందా వేచి చూడాల్సి ఉంది.

పేద కుటుంబాలను రోడ్డున పడేయొద్దు

గృహాలు తొలగించవద్దని తహసీల్దార్‌కు పేదలు, వైఎస్సార్‌సీపీ నేతల వినతి


తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందచేస్తున్న చక్రవర్తి, బాధిత పేదలు

పెనమలూరు: నిరుపేద కుటుంబాలకు చెందిన వాళ్లం. గత 30 సంవత్సరాలుగా కాలువ కట్టపై నివశిస్తున్నాం.. ఇప్పుడు కట్టుబట్టలతో ఇళ్లు ఖాళీ చేయమని నోటీసులు ఇస్తే ఏం చేయాలో పాలుపోవటం లేదని తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. కానూరు కాలువ కట్టపై నివశిస్తున్న దాదాపు 40 కటుంబాలను ఈ నెల 11వ తేదీ నాటికి ఇళ్లు ఖాళీ చేయాలని, లేక పోతే నేలమట్టం చేస్తామని తహసీల్దార్ ఇటీవల నోటీసులు ఇచ్చారు. దీంతో పెనమలూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో పేదలు మంగళవారం తహసీల్దార్ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పేదలు మాట్లాడుతూ తాము గత 30 సంవత్సరాలుగా కాలువకట్టపై ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నామన్నారు. ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు సకాలంలో చెల్లిస్తున్నామని తెలిపారు. తమకు ప్రత్యామ్నయంగా స్థలాలు కేటాయించకుండా ఇళ్లు ఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. తమకు ఉపాధి, పిల్లల చదువులు ఉన్నాయని, ఇళ్లు తొలగిస్తే ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు మహిళలు మీడియా ఎదుట కంట తడిపెట్టారు.

పేదలకు న్యాయం చేయండి: చక్రవర్తి

చాలా కాలంగా నివశిస్తున్న పేదల ఇళ్లు ఆకస్మికంగా తొలగిస్తామని నోటీసులు ఇవ్వటం తగదని, వారికి వెంటనే న్యాయం చేయాలని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి కోరారు. కూటమి ప్రభుత్వం పేదలకు మేలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఇళ్లు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటే 90 రోజుల్లో స్థలాలు కేటాయిస్తామని మెసేజ్‌లు పెట్టి ఇప్పుడు ఇళ్లు తొలగిస్తామని నోటీసులు ఇవ్వటం ఎంతవరకు న్యాయమన్నారు. పేదలకు న్యాయం జరగకపోతే వైఎస్సార్ సీపీ న్యాయ పోరాటం చేస్తుందని తెలిపారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ సమస్య కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, పెనమలూరు మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు పి.రాఘవరావు, చాంద్‌బాషా, మండూరు కోటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, హక్, అష్రఫ్, మరీదు విజయ్‌కుమార్, అజయ్, కత్తెరబాషా, మరీదు గురుప్రసాద్, కోడె పండు, వణుకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సీడీపీవో బేబీసుకన్య


వణుకూరులో తల్లికి సన్మానం చేస్తున్న సీడీపీవో బేబీసుకన్య


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు


కంకిపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెనమలూరు: గ్రామాలలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని ఐసీడీఎస్ సీడీపీవో బేబీ సుకన్య సూచించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలో అందరూ కృషి చేయాలని అన్నారు. వణుకూరు గ్రామంలో మంగళవారం కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌లో ఆమె ప్రసంగించారు. బాల్య వివాహాల వలన అనేక దుష్ప్రభావాలు చోటు చేసుకుంటాయన్నారు. బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమన్నారు. తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయబోమని తెలిపిన ఇద్దరు తల్లులను సన్మానించారు. సూపర్‌వైజర్ కె.శ్రీలత, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తుల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. కాగా పోరంకి బీజేఆర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో బేబీసుఖన్య పాల్గొన్నారు. బాల్య వివాహాల వలన వచ్చే అనర్థాలను స్థానికులకు వివరించారు.

కానూరులో విద్యార్థులకు సన్మానం

కానూరులో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ చదువు భవిష్యత్తుకు బాట వేస్తుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికి, బాలికల విద్యకు అందరూ మద్దతుగా నిలవాలన్నారు. సచివాలయం ఉద్యోగులు, ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు ఐక్యంగా కృషి చేయాలి

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సమ్మర్ స్పెషల్ కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి తహసీల్దారు జె.విమలాకుమారి మాట్లాడుతూ.. బాల్య వివాహాల నియంత్రణకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. 18 ఏళ్లలోపు ఆడ పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ శాఖలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామ సర్పంచి లాంధిబోర, పంచాయతీ కార్యదర్శి ఎన్.రాజేంద్రవరప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీ పద్మాదేవి, ప్రొటెక్షన్ కమిటీ కౌన్సిలర్ జే స్వరాజ్యం పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరంలో..

స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.నాగ పద్మావతి కిశోర బాలికలకు వివరించారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కంకిపాడు: కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ కంకిపాడు సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. కంకిపాడు పట్టణంలోని పద్మావతి నగర్‌లో కిశోర వికాసం ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనలో మార్పులు, ఇతరులతో సంభాషణల తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కిశోర బాలికలు మంచి చెడులను అవగాహన చేసుకుని మసలుకోవాలన్నారు. ఎల్‌పీఓ శైలజ మాట్లాడుతూ చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. ఈ సందర్భంగా కిశోర బాలికల వికాసంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు




ముస్తాబాద(గన్నవరం): మండలంలోని ముస్తాబాదలో అక్రమ మట్టి రవాణ ఓ వ్యక్తి ప్రాణాల మీదగా తీసుకువచ్చింది. ముస్తాబాద పంచాయతీ వెదురుపావులూరు రెవెన్యూ పరిధిలోని పెద చెరువులో గత కొన్ని రోజులుగా టీడీపీ నేతలు మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఐదు డీ 200 అతిపెద్ద మిషన్లతో తవ్విన మట్టిని సుమారు 500 ట్రాక్టర్లతో ముస్తాబాద, పరిసర గ్రామాలతో పాటు విజయవాడకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు ఎక్కువ ట్రిప్పులకోసం ట్రాక్టర్ డ్రైవర్లు అతివేగంతో వాహనాలు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో బైక్‌పై వస్తున్న సూరంపల్లికి చెందిన గుజ్జల వెంకటేశ్వరరావు అలియాస్ బాబును హైస్కూల్ సెంటర్‌లో మంగళవారం మట్టి ట్రాక్టర్ ఢీకొట్టింది. రోడ్డుపై పడిపోయిన అతన్ని చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. బాబు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. పోలీసులు విచారణ జరుపుతున్నారు. వెదురుపావులూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కన పెద చెరువులో ఈ అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. గురువారం నుంచి హైస్కూల్ పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి పరామర్శ

గన్నవరం రూరల్: సిద్ధార్థ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావును జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పరామర్శించారు. వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ అనేక పొక్లెయిన్‌లు, వందల కొద్దీ ట్రాక్టర్‌లు మట్టిని తరలిస్తున్నాయని, అధికారులు ఏ విధంగా పర్మిషన్‌లు ఇచ్చారని ప్రశ్నించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు చెరువును పరిశీలించాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరరావుకు న్యాయం చేయాలని కోరారు.

రేషన్ పంపిణీ వాహనాలను కొనసాగించాలి



కంకిపాడు: రేషన్ పంపిణీ వాహనాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పీ రంగారావు డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీలో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. రంగారావు మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులు ప్రజల ఇంటి వద్దకే చేరాయన్నారు. రేషన్ అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో డిపోల వద్ద నుంచి సరుకులు తెచ్చుకోవాలని సూచించటం సరైంది కాదన్నారు. అక్రమ రవాణాను అడ్డుకుంటూ ప్రజలకు ఇంటికే రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీకి బదులుగా నగదు బదిలీ ఆలోచన ఉపసంహరించుకోవాలని కోరారు. పార్టీ నేతలు తాడంకి నరేష్, వి.శివశంకర్, సీహెచ్ శ్రీహరి, జి.కుమారి, కె.నాంచారయ్య, టీ దివ్యప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాత తూములనూ వదలని కక్కుర్తి


మామిడితోటలో ఉంచిన పంచాయతీ పాత తూములు


దాచి ఉంచిన బీఎస్ఎన్ఎల్ స్తంభాలు

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం గ్రామ శివారు మర్లపాలెంలో ఓ టీడీపీ నేతకు చెందిన మామిడితోటలో గ్రామ పంచాయతీకి చెందిన తూములు, బీఎస్ఎన్ఎల్‌కు చెందిన ఐరన్ స్తంభాలు బయటపడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీ పరిధిలో తొలగించిన పాత తూములను గుట్టుచప్పుడు కాకుండా మర్లపాలెంలోని అశోక్ అనే టీడీపీ నేత అధినంలో ఉన్న మామిడితోటలోకి తరలించారు. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని బీఎస్ఎన్ఎల్‌కు చెందిన ఐరన్ స్తంభాలను కూడా అక్రమంగా అదే స్థలంలో నిల్వ చేశారు. గ్రామ పంచాయతీ, బీఎస్ఎన్ఎల్‌కు చెందిన తూములు, స్తంభాలను చట్ట విరుద్ధంగా ఇక్కడికి అక్రమంగా తరలించి దాచి ఉంచినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీటిని విక్రయించే ప్రయత్నంలో విషయం బయటపడడంతో నిల్వ చేసిన తూములు, స్తంభాలను వేరే ప్రాంతానికి తరలించే పనిలో ఆ వ్యక్తి నిమగ్నమయ్యాడని సమాచారం. అధికారులు వెంటనే స్పందించి సదరు సామగ్రిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని, ఆ వ్యక్తిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పత్రికా కార్యాలయాలపై దాడి హేయం


మాట్లాడుతున్న చక్రవర్తి

పెనమలూరు: కూటమి ప్రభుత్వం సాక్షి పత్రికా కార్యాలయాలపై దాడులు చేయించటం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఖండించారు. ఆయన పెనమలూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, చేతకాని పాలనను కప్పి పుచ్చుకోవటానికే సాక్షిపై దాడులు చేస్తోందని ఆరోపించారు. అనంతపురంలో జరిగిన యువతి గ్యాంగ్ రేప్, మరో ఘటనలో బాలిక హత్యకు సమాధానం చెప్పలేకే ప్రజలను దృష్టి మళ్లిస్తున్నారని విమర్శించారు. గతంలో వైఎస్సార్ సీపీ పాలనలో పచ్చ మీడియాలో ప్రభుత్వంపై అనేక అసత్య ఆరోపణలు చేసినా ఎప్పుడూ దాడులు చేయలేదన్నారు. నేడు జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబం సభ్యులపై వ్యక్తిత్వ హననం చేస్తున్నారని, కూటమి నేతలు నీచానికి దిగారని అన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసి కూటమి నేతలు ఆనందం పొందుతున్నారన్నారు.

గ్రామ కంఠం అన్యాక్రాంతంపై నోటీసులు జారీ

సాక్షి స్పందన


అధికారులు జారీ చేసిన నోటీసు

ఉయ్యూరు: గ్రామకంఠం అన్యాక్రాంతంపై అధికారుల్లో కదలిక వచ్చింది. అక్రమ వీలునామా రిజిస్ట్రేషన్ తతంగంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలతో గండిగుంట పంచాయతీ కార్యదర్శి ఆక్రమణదారులకు మంగళవారం నోటీసులు ఇచ్చారు.మండలంలోని గండిగుంట గ్రామంలో పంచాయతీకి చెందిన గ్రామకంఠం భూమి అన్యాక్రాంతం అయ్యింది. ముక్కామల నిర్మలకుమారి, తన కుమారుడు షాయోజీరావుకు గ్రామ కంఠం భూమిని అక్రమ వీలునామాతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. దీనిపై సాక్షిలో 'గ్రామకంఠం అన్యాక్రాంతం' శీర్షికన కథనం మంగళవారం ప్రచురితమైంది. పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారులు ఈ విషయమై చర్యలకు ఆదేశించారు. ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు మంగళవారం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఇదే విషయమై సమీక్ష జరిపారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇంటి పన్ను పొందిన షాయోజీరావు కుటుంబ సభ్యులకు పంచాయతీ కార్యదర్శి కూర్మారావు నోటీసులు అందించారు. మూడు రోజుల్లోగా ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్ పొందటంపై దస్తావేజులు అందించాలని పేర్కొన్నారు. దీంతో షాయోజీరావు వీలునామా రిజిస్ట్రేషన్ రద్దు చేసుకునే ఆలోచనలో పడినట్లు సమాచారం.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గ్రామకంఠం అన్యాక్రాంతం విషయంలో బాధ్యులు అందరిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. స్థానిక విలేకరులతో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బందెల శ్రీనివాసరావు, నాయకులు గొల్లపూడి వేణుబాబు, సుకుమార్ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నామన్నారు. గ్రామకంఠంకు చెందిన భూమిలో పాలకేంద్రం నిర్మించేందుకు 2022లో జిల్లా కలెక్టరు నుంచి అనుమతులు పొందామన్నారు. అన్యాక్రాంతానికి బాధ్యులు, సహకరించిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గండిగుంటలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల పరిరక్షణకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

నువ్వు టీడీపీయేనా.. గుర్తింపు కార్డు ఏదీ?

రైతుబజారు తనిఖీలో ఏఎంసీ చైర్మన్ ధనయ్య వ్యాఖ్యలు


కంకిపాడు రైతుబజారులో తనిఖీలు చేస్తున్న ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య

కంకిపాడు: ఏంటి నువ్వు టీడీపీయేనా..?, నీకు పార్టీ సభ్యత్వం కార్డు ఉందా?, ఉంటే ఏదీ? ఖచ్చితంగా ఆ కార్డు కూడా రైతుకార్డులతో పాటు ఉండాల్సిందే?' అంటూ ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య చేసిన వ్యాఖ్యలకు రైతులు నివ్వెరపోయారు. పట్టణంలోని రైతుబజారును ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, పలువురు పార్టీ నేతలు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణదారుల వద్దకు వెళ్లి గుర్తింపు కార్డులు, అందులో కేటాయించిన కూరగాయల రకాలను పరిశీలించారు. పలువురి గుర్తింపు కార్డులు సక్రమంగా లేవని, పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా, దుకాణదారులతో మాట్లాడే క్రమంలో 'ఏంటి నువ్వు టీడీపీనేనా?, కాదా?, సభ్యత్వం రెన్యూవల్ అయ్యిందా?, గుర్తింపు కార్డు కూడా తప్పనిసరిగా వెంట పెట్టుకోండి. ఈ సారి వచ్చినప్పుడు టీడీపీ గుర్తింపు కార్డులు కూడా చూస్తా?. కార్డులు లేకపోతే దుకాణం ఉండదు?' అంటూ వ్యాఖ్యానించారు. రైతుబజారులో దుకాణ నిర్వహణకు రైతులు, కౌలు రైతులు అయితే సరిపోదా?, పూర్తిగా టీడీపీ కార్యకర్తలకే దుకాణాలు ఇస్తారా?, అని పలువురు గుసగుసలాడుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పూర్తిగా రాజకీయ ప్రమేయం చేసేశారన్న వాదనకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

పెనమలూరు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.సుధారాణి అన్నారు. తాడిగడప గ్రామంలో మంగళవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివాజ్ సింగ్‌చౌహాన్ ఆదేశాలతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సుధారాణి మాట్లాడుతూ రైతులు భూమిని ఎల్లవేళలా కాపాడు కోవాలన్నారు. సకాలంలో భూసార పరీక్షలు చేయించాని సూచించారు. ఘంటశాల వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త సత్యప్రియలలిత మాట్లాడుతూ వరిలో నూతన వంగడాలతో సాగు చేయాలన్నారు. డాక్టర్ సుబ్బన్న, డాక్టర్ ఎం.శ్రీధర్, డాక్టర్ కృష్ణవేణి, ఏవో ఎల్.శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి చందుజోసెఫ్ పాల్గొన్నారు.